సాక్షి ప్రకాశం

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



ఆరోగ్యానికి ఆరంభం

మార్కాపురంలో రూ.475 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మరోవైపు ప్రొఫెసర్లు, సిబ్బందిని నియమించారు. - IIలో..



ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం

బైక్‌పై వెళ్తున్న యువకుడిని ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం చెందిన ఘటన కనిగిరి మండలం గార్లపేట రోడ్డులో చోటుచేసుకుంది. - IIలో..

గరిష్టం/కనిష్టం 37/29

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్లుగా ఇరువురి నియామకం





భవనం రామచంద్రారెడ్డి, ఎం.కాశిరెడ్డి

ఒంగోలు: జేసీఎస్ (జగనన్న సచివాలయ కన్వీనర్లు) జిల్లా కోఆర్డినేటర్లుగా ఇరువురిని నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత జాబితాను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. భవనం రామచంద్రారెడ్డి (తర్లుపాడు), ఎం. కాశిరెడ్డి(బేస్తవారిపేట మండలం చెట్టిచర్ల)ను కోఆర్డినేటర్లుగా నియమించారు.

ఆరోగ్యశ్రీ సేవల పరిశీలన

ఒంగోలు అర్బన్: ఏపీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు శుక్రవారం నగరంలోని ప్రశాంతి హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ సేవలను పరిశీలించారు. ఆరోగ్య మిత్రలతో మాట్లాడి రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య చేయించుకుంటున్న గర్భిణులు, ఆర్థోపెడిక్ రోగులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా తీశారు. గర్భిణులకు వైఎస్‌ఆర్ ఆసరా ద్వారా రూ.5 వేలు, రవాణా చార్జీలు కూడా ఆరోగ్యశ్రీలో పొందుపరిచినట్లు తెలిపారు.

అమృత జలాలు

వాన చినుకుని ఒడిసిపట్టి ఎక్కడికక్కడ నేలలో ఇంకించి భూగర్భ జలాలను పెంచాలనే లక్ష్యంతో చేపట్టిన అమృత్ సరోవర్ పథకం సత్ఫలితాలనిస్తోంది. ఈ పథకం కింద రెండు విడతల్లో చేపట్టిన కుంటల అభివృద్ధి పనులు దాదాపు పూర్తికావచ్చాయి. జిల్లాలో రూ.4.84 కోట్లు ఇప్పటి వరకు దానికోసం వెచ్చించారు. ఆ కుంటలోని నీళ్ల ద్వారా పంటలు పండించుకోవటానికి, తాగునీటి అవసరాలకు తగ్గట్టుగా కూడా కుంటను తీర్చిదిద్దుకోవచ్చు. పశువుల తాగునీటి అవసరాలూ తీర్చుకోవచ్చు.

- అమృత్ సరోవర్ పథకంతో భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదం
- వ్యవసాయంతో పాటు ప్రత్యామ్నాయంగా నీటి వినియోగానికి దోహదం
- ఆగస్టు 15కు లక్ష్యంగా ఇచ్చిన 125 కుంటలు పూర్తిచేయాలని నిర్దేశం
- రెండు విడతల్లో 111 కుంటల అభివృద్ధి పనులు పూర్తి
- పురోగతిలో మరో 14 కుంటల పనులు
- ఇప్పటి వరకు రూ.4.84 కోట్లు ఖర్చు
- ప్రస్తుతం నా మట్టి..నా దేశం పేరుతో పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

నీరు అన్నింటికీ ప్రాణాధారం...ఎక్కడైతే నీరు పుష్కలంగా ఉంటుందో ఆ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది. పచ్చటి చీర కట్టినట్లు భూదేవి పచ్చదనాన్ని సింగారించుకుంటుంది. స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఆజాదీకా అమృత మహోత్సవ్ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ''అమృత్ సరోవర్'' పథకానికి నాంది పలికింది. వర్షపు నీటిని ఒడిసి పట్టుకొని నిల్వ చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ పథకానికి రూపకల్పన చేశారు. వర్షపు నీరు వృథాగా సముద్రంపాలు కాకుండా ఎక్కడ పడిన వర్షం నీరు అక్కడే నిల్వ ఉండటంతో పాటు భూమిలోకి ఇంకించడం కూడా ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కుంటల్లో నీరు నిల్వ ఉండటంతో పాటు భూగర్భ జలాలు పెంచడం ఈ పథకం లక్ష్యంగా ఉంది. 2022 ఏప్రిల్ 24న పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమృత్ సరోవర్ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 125 కుంటలను అభివృద్ధి చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. అందులో తొలివిడతగా 75 కుంటలు తవ్వి వాటిలో నీటిని నిల్వ చేయటం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నది పాలకుల ఆలోచన.



సానికవరం గ్రామంలో మొక్కలు నాటి శిలాఫలకం ఏర్పాటు చేసిన స్థానికులు (ఫైల్)

జిల్లాలో ఇప్పటికే 111 కుంటలు పూర్తి:

నూతన ప్రకాశం జిల్లాలో ఇప్పటికే 111 కుంటల నిర్మాణం పూర్తయింది. తొలివిడతగా జిల్లాకు 75 కుంటలు లక్ష్యంగా నిర్ణయించి పూర్తి చేశారు. రెండో విడతలో మరో 50 కుంటలు పూర్తి చేయాలని నిర్ణయించారు. అయితే వాటిలో 36 కుంటలు ఇప్పటికే పూర్తి చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా మరో 14 కుంటల పనులు జరుగుతున్నాయి. ఒక్కో కుంట ఒక ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. నూతన ప్రకాశం జిల్లాలోని ఒంగోలు మండలం మినహా మిగతా 37 మండలాల్లో ఈ పథకం కింద కేటాయించారు. ఒక్కో మండలంలో ఒకటి, అంతకంటే ఎక్కువగా చేపట్టేందుకు నిర్ణయించారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా కుంటల నిర్మాణానికి సర్వే చేసి ఎక్కడ అవసరం అవుతుందో అక్కడ తవ్వేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 328 కుంటలు తవ్వేందుకు ప్రాంతాలను గుర్తించారు. కుంటల్లో కూడా చుట్టూ కట్టలు ఏర్పాటు చేసి వాటిపై మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో మొత్తం జిల్లాలో 125 కుంటలను లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం సర్వే చేసిన వాటిలో అత్యధికంగా కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి మండలంలో 29 ట్యాంకులను గుర్తించారు. అత్యల్పంగా టంగుటూరు, పుల్లలచెరువు మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మాత్రమే గుర్తించారు. ఆ కుంటలోని నీళ్ల ద్వారా పంటలు పండించుకోవటానికి వినియోగించుకోవచ్చు. తాగునీటి అవసరాలకు తగ్గట్టుగా కూడా కుంటను తీర్చిదిద్దుకోవచ్చు. పశువుల తాగునీటి అవసరాలూ తీర్చుకోవచ్చు.

ముమ్మరంగా ఉపాధి అవకాశాలు:

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అమృత్ సరోవర్ పథకంలో జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. ఒక్కో కుంట 10 వేల క్యూబిక్ మీటర్ల మేర నీరు నిల్వ చేయగలిగేలా ట్యాంకులా తవ్వేందుకు ప్రణాళికలు రూపొందించారు. ట్యాంకు నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి గ్రామంలో ఇద్దరు ప్రతినిధులను కేటాయించారు. వారు అధికారులు, లేదా ప్రజా ప్రతినిధులు అయినా కావచ్చు. నూతనంగా తవ్వుతున్న ట్యాంకుకు సంబంధించిన పూర్తి వివరాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అమృత్ సరోవర్ యాప్‌లో నమోదు చేశారు.

నా మట్టి...నా దేశం

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మొదటి విడతలో అమృత్ సరోవర్ పనుల గడువు ముగియగానే రెండో కార్యక్రమంగా 'నా మట్టి...నా దేశం' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. 'వసుధకు వందనం' పేరుతో ప్రతి గ్రామ పంచాయతీలో 75 దీర్ఘ కాలికంగా ఉండే మొక్కలు నాటాలని నిర్ణయించారు. అందులో భాగంగా జిల్లా యంత్రాంగం ప్రతి గ్రామాన్ని, పట్టణాన్ని, నగరాన్ని ఎంపిక చేసుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా ప్రతి పాఠశాల, కళాశాలల్లో కూడా మొక్కలు నాటుతున్నారు. మాతృదేశ మట్టికి కృతజ్ఞత తెలిపేందుకు దేశంలోని ప్రతి గ్రామ పంచాయతీ భాగస్వామ్యం కావాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. కార్యక్రమంలో భాగంగా దేశం కోసం పోరాడిన త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ పంచాయతీలలో జ్ఞాపక ఫలకాలను ఏర్పాటు చేస్తున్నారు. 'నా భూమి..నా దేశం' కార్యక్రమంలో భాగంగా 'నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం' పేరుతో శిలాఫలకాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

అమృత్ సరోవర్‌లో మిగతా కుంటలు కూడా పూర్తి చేస్తాం

అమృత్ సరోవర్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా మరో 14 కుంటల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే 111 కుంటల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగతా కుంటల పనులు కూడా త్వరలో పూర్తి చేస్తాం. అదేవిధంగా 'నా మట్టి..నా దేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలల్లో దీర్ఘకాలంగా జీవించే మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

– శీనారెడ్డి, పీడీ, డ్వామా

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు, పక్కన ఎమ్మెల్యే కేపీ

- జేసీ శ్రీనివాసులు

మార్కాపురం టౌన్: ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా స్థాయి ప్రభుత్వ యంత్రాంగం క్షేత్ర స్థాయికి వెళ్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. ప్రత్యేక స్పందనలో భాగంగా శుక్రవారం స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో మార్కాపురం మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గతంలో నియోజకవర్గ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించామని, ప్రస్తుతం క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ స్థానికంగానే సమస్యలను పరిష్కరించేలా అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. అర్జీలను సహేతుకంగా సత్వరమే పరిష్కరించాలని అధికారులను జేసీ ఆదేశించారు. ప్రజా అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీలకు పరిష్కారం చూపలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని స్పష్టం చేశారు. అర్జీదారుల్లో సంతృప్త స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని జేసీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల వద్దకే వెళ్లి వారికి అవసరమైన సర్టిఫికెట్లను సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని అందించారని, అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి తాజాగా మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేసి ప్రజలకు సేవలు అందించాలని కోరారు.

వివిధ సమస్యలపై అర్జీల అందజేత:

ప్రత్యేక స్పందన కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణ, మండలాల నుంచి అనేక మంది ప్రజలు హాజరై తమ సమస్యలను అర్జీలు అందచేశారు. పట్టణంలో నాగులవరం రోడ్డులోని శ్మశానవాటికను కొందరు ఆక్రమిస్తున్నారని జేసీకి కౌన్సిలర్ ముంగమూరి శ్రీనివాసులతోపాటు మరికొందరు వివరించారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో మంచినీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశామని, బిల్లులు అందలేదని జేసీ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య ఉద్యోగులకు సుమారుగా రెండేళ్ల నుంచి ఇంక్రిమెంట్లు ఇవ్వడంలేదని చెప్పారు. తిప్పాయపాలెంలో తమకు చెందిన భూమిలో మరికొందరు ఆక్రమించుకుని అక్రమంగా ఫెన్సింగ్ వేశారని తమ సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకునివెళ్లినా పరిష్కారం కావడం లేదని డీ చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు. వివిధ సమస్యలపై 154 అర్జీలను జేసీకి అందచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ నారదముని, వివిధ శాఖలకు చెందిన ప్రాజెక్టు డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందాలి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



జీజీహెచ్ ఆవరణలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న బాలినేని

- వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- రూ.23.75 కోట్లతో జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

ఒంగోలు అర్బన్: ప్రతి ఒక్క పేదకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అందుకే వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) ప్రాంగణంలో రూ.23.75 కోట్లతో చేపట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేసిన ప్రభుత్వం తమదని అన్నారు. ఇప్పటికే వేలాది ఉద్యోగాలు కల్పించడంతో పాటు వైద్య సేవలు ప్రజలకు సేవ చేరువ చేసేందుకు విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల వద్దకే వైద్య బృందం వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జగనన్న ఆరోగ్యరక్ష కార్యక్రమంతో ఇంటింటికీ వైద్యసేవలు అందించే కార్యక్రమం కూడా ప్రారంభించారన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉండే క్రిటికల్ కేర్ (క్లిష్టతర వ్యాధుల సంరక్షణ విభాగం) ఇప్పుడు జీజీహెచ్‌లో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు, క్లిష్ట పరిస్థితులు ఏర్పడినా రోగులకు క్రిటికల్‌కేర్ బ్లాక్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వైద్యులు, వైద్యాధికారులు మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబులు మాట్లాడుతూ జీజీహెచ్, మెడికల్ కాలేజీకి బాలినేని అందిస్తున్న సహకారం మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో ఉపయోగపడే క్రిటికల్ కేర్‌బ్లాక్ ఏర్పాటు చేసేందుకు సహకరించడం గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రస్తుతానికి ఐసీయూని క్రిటికల్ కేర్‌కి వినియోగిస్తున్నామని, ఈ బ్లాక్ నిర్మాణంతో జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. దీనిలో కార్పొరేటర్‌లు ఈదర సురేష్, నాగరాజు, జీజీహెచ్, మెడికల్ కాలేజి అధికారులు, సిబ్బంది, నాయకులు కటారి శంకర్, గంటా రామానాయుడు, శాండిల్య తదితరులు పాల్గొన్నారు. జీఎన్‌ఎం నర్సింగ్ విద్యార్థినిలు నర్సింగ్ కాలేజిలో నిలిచిపోయిన జీఎన్‌ఎం కోర్సును పునః ప్రారంభించనందుకు విద్యార్థినిలు బాలినేనిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

- సచివాలయాల ద్వారా మెరుగైన సేవలందించాలి
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో సాగునీటి లభ్యతను బట్టి పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ మేరకు నీటిపారుదల, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. శుక్రవారం స్పందన భవనంలో జిల్లా సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా నదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున జిల్లాకు నీటిని విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. కాలువలపై ఆధారపడి సాగుచేసే రైతులకు ఈ విషయాన్ని తెలపాలన్నారు. బోర్ల ద్వారా సాగు చేసుకునే రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేల ద్వారా సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేయూత పథకం ద్వారా లబ్ధిపొంది పశువులను కొనుగోలు చేసిన పాడిరైతులు కచ్చితంగా అమూల్ సంస్థకు పాలు పోసేలా చూడాలన్నారు. అర్హులైన రైతులకు సీసీఆర్‌సీ కార్డులను త్వరగా మంజూరు చేయాలని సూచించారు.

జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఆర్‌బీకేల ద్వారా ఎరువుల సరఫరాను పెంచాలన్నారు. ఎంపీఎఫ్‌సీ అవసరం ఉన్న చోట ఇప్పటికే అందుబాటులో ఉన్న స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాలని కోరారు. సబ్సిడీపై రైతులకు అందించే పైపులు, ఇతర వ్యవసాయ పరికరాల సరఫరా పెండింగ్ త్వరగా క్లియర్ చేయాలన్నారు. ఎకరాకు సబ్సిడీపై ఇస్తున్న 25 కేజీల శనగ విత్తనాలను 40 కేజీలకు పెంచితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వర్కింగ్ క్యాపిటల్ కోసం పశువులకు ట్యాగ్స్ వేసిన అర్హులైన పాడి రైతుల వివరాలు అందజేయాలని కోరారు. ప్రాథమిక సహకార సంఘాలకు ఎరువులపై ఇస్తున్న క్రెడిట్ లిమిట్‌ను రూ.5 లక్షలకు పైగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ సంఘాల తరఫున మార్క్‌ఫెడ్‌కు బ్యాంక్ గ్యారెంటీ ఇస్తామన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలపై సబ్సిడీ రేటు పెంచేలా చూడాలని కోరారు.

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియను ఈ నెల చివరకు పూర్తి చేస్తామన్నారు. ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ మాట్లాడుతూ సబ్సిడీ రైతులకు పైపుల పంపిణీ ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. నీటి పారుదల శాఖ ఎస్‌ఈ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన సాగర్ జలాలను తాగునీటి అవసరాల కోసమే చెరువులకు మళ్లించామన్నారు. మరో రెండు విడతలు ఈ విధంగా సరఫరా అవుతాయని తెలిపారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఉద్యాన శాఖ అధికారి గోపిచంద్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, మార్క్‌ఫెడ్ మేనేజర్ హరికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ అలీ, మత్స్యశాఖ ఏడీ ఉషారాణి, వ్యవసాయ సలహాబోర్డు డైరెక్టర్‌లు, దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రేపు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్, జూనియర్ క్రీడాజట్ల ఎంపిక ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు గుడ్లూరు మండలం చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మండవ వెంకటస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ ఎంపికకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లోని 2008 జనవరి 2వ తేదీ తరువాత జన్మించిన వారు ఎవరైనా హాజరుకావొచ్చన్నారు. జూనియర్స్ ఎంపికకు 2004 జనవరి 2వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఆసక్తిగల వారు ఎంపికకు హాజరయ్యే సమయంలో వయస్సు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. జిల్లాలో ఎంపికై న క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు పొట్టేళ్ల మురళి, సెల్: 9000391008ను సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు 25 వరకు పొడిగింపు

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది 8వ తరగతి చదువుతుండి, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పుడు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదన్నారు. డిసెంబర్ 3న పరీక్ష మూడు రెవెన్యూ డివిజన్లలో జరుగుతుందని, ఈ తేదీ నాటికి పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్ష ఫీజు కింద జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఈనెల 25వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులో సవరణలుంటే పాఠశాల లాగిన్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ నిలిచిన మూడు రోజుల్లోగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

గొర్రెలు, మేకల మేతకు భూములు కేటాయించాలి

- కార్యవర్గ సమావేశంలో గొర్రెల, మేకల సహకార సమాఖ్య జిల్లా చైర్మన్ బొట్ల రామారావు



మాట్లాడుతున్న బొట్ల రామారావు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో గొర్రెలు, మేకలు మేపుకోవటానికి అటవీ భూములు కేటాయించాలని, అందుకు సంబంధించిన జీఓను అమలు చేయాలని గొర్రెల, మేకల సహకార సమాఖ్య చైర్మన్ బొట్ల రామారావు అధికారులను కోరారు. ఈ మేరకు స్థానిక జిల్లా పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయంలోని సమాఖ్య భవనంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అందులో ప్రధానమైనవి...కనిగిరి వద్ద ఉన్న సంతను ఉపయోగంలోకి తీసుకురావాలని, పశువుల జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయాలని, ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల రికార్డులను సక్రమంగా పెట్టుకొని సకాలంలో ఎన్నిక నిర్వహించాలని, 50 సంవత్సరాలు నిండిన గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారులకు పెన్షన్ మంజూరు చేయాలని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ మ్యాచింగ్‌తో పశువుల షెడ్లు మంజూరు చేయాలని, ఫారెస్ట్‌లోకి గొర్రెల మేత కోసం అనుమతి ఇస్తూ ఇచ్చిన జీఓను అధికారులు అమలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఈడీ సీహెచ్.వెంకట్రామిరెడ్డి, త్రీ మెన్ కమిటీ సభ్యులు వేల్పుల వెంకట సుబ్బయ్య, బొరిగర్ల రాజయ్య, మాజీ చైర్మన్ కేకే.రాజుతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాలపై కసరత్తు

ఒంగోలు అర్బన్: ఒంగోలు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కసరత్తు చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఒంగోలు నగరం, రూరల్ మండలం, కొత్తపట్నం మండలంలోని మొత్త పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అనుకూలంగా ఉన్నాయా లేదా చర్చించారు. 1400 ఓట్లు కంటే ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను రెండు పోలింగ్ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించారు. దీనిలో ఓఎంసి డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు , ఏసీపీ వెంకటేశ్వర్లు, టీపీవో శివప్రసాద్, ఒంగోలు తహశీల్దార్ మురళి, వైఎస్‌ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, సత్యం, రసూల్, చౌదరి పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన:

ఈవీఎం గోదాములో కొత్తగా వచ్చిన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోలు యూనిట్‌లను జిల్లా ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో యంత్రాల పనితీరును పరిశీలించారు.

ఆరోగ్యానికి ఆరంభం

- మార్కాపురం జిల్లా వైద్యశాలలో ప్రొఫెసర్లు, సిబ్బంది నియామకం
- ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో ప్రొఫెసర్ల సేవలు
- డీఎంఈ పరిధిలోనికి ఆస్పత్రి
- ఇన్‌చార్జిగా ఒంగోలు కాలేజీ ప్రిన్సిపాల్
- వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్ల కోసం యత్నం

శరవేగంగా సాగుతున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు



మార్కాపురం: నియోజకవర్గ కేంద్రం మార్కాపురం శివార్లలో 475 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఒకవైపు వేగంగా జరుగుతున్నాయి. మరో వైపు వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కళాశాలకు కావాల్సిన ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్ల నియామకానికి చర్యలు తీసుకున్నారు. గడిచిన మూడు రోజుల్లో మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు, మెడికల్ కాలేజీకి సంబంధించి ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమించారు. అసిస్టెంటు ప్రొఫెసర్లుగా డాక్టర్ జేసీహెచ్ కేఎల్‌పీ కిశోర్, డాక్టర్ పి. భక్తవత్సలం, కె. ప్రవీణ్ శివ, అసిస్టెంటు ప్రొఫెసర్‌గా డాక్టర్ ఎస్.కె. రియానా నియమితులైనట్లు జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. సుబ్బారెడ్డి తెలిపారు. మెడికల్ కాలేజీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోనికి వెళ్లిందని, కళాశాల ప్రిన్సిపాల్‌గా ఒంగోలు జీజీహెచ్ కాలేజీ ప్రిన్సిపాల్ మార్కాపురంలోని మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్నారని తెలిపారు. నియమితులైన వారిలో డాక్టర్ రియానా ఫోరెన్సిక్ మెడిసిన్ అసిస్టెంటు ప్రొఫెసర్ కాగా మిగిలిన వారు ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలకు కేటాయించారు. ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో 33 మంది వైద్యులు ఉండగా ప్రొఫెసర్ల రాకతో పలువురు డాక్టర్లు బదిలీపై వెళ్లారు.

500 పడకల ఆస్పత్రి

మెడికల్ కాలేజీలో భాగంగా 500 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో డాక్టర్స్, సిబ్బంది క్వార్టర్స్ నిర్మిస్తున్నారు. మొత్తం 18 విభాగాలను ఏర్పాటు చేస్తారు. 120 జనరల్ మెడిసిన్ బెడ్‌లు, 120 జనరల్ సర్జరీ బెడ్‌లు, 60 పిడియాట్రిక్ (చిన్న పిల్లల) బెడ్‌లు, 60 ఆర్థోపెడిక్ బెడ్‌లు, 60 గైనకాలజీ, 10 ఆప్తమాలజీ, 10 డెర్మటాలజీ, 10 బెడ్‌లు తల, మెదడు, చెవి, ముక్కు బాధితుల కోసం , 6 ఐసీయూ, 26 ఎమర్జెన్సీ బెడ్‌లు, ఇలా పలు చికిత్సల కోసం బెడ్‌లు ఏర్పాటు చేయనున్నారు. 8 ల్యాబ్‌లు, 4 లెక్చర్ థియేటర్‌లు, 250 మంది కూర్చునే ఎగ్జామినేషన్ హాల్, 8 టీచింగ్ రూంలు నిర్మించనున్నారు. ఇక స్టూడెంట్ హాస్టల్స్‌తో పాటు నర్సింగ్ హాస్టల్, సెంట్రల్ కిచెన్ హాల్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, డయాలసిస్ సెంటర్, మెటర్నిటీ వార్డు తదితర భవనాలను కూడా నిర్మిస్తారు. ఒక్కొక్క విభాగంలో 10 మంది డాక్టర్లుంటారు. ఈ లెక్క ప్రకారం సుమారు 200 నుంచి 250 మంది వరకు సాధారణ వైద్యులతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తారు. కిడ్నీ రీసర్చ్ సెంటర్ కూడా ఇక్కడే నిర్మించనున్నారు. ఇది పూర్తయితే జిల్లాలోని కిడ్నీ బాధితులకు కూడా డయాలసిస్‌తో పాటు మెరుగైన వైద్యసేవలు లభిస్తాయి. ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఉంది. మార్కాపురంలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయటం వలన ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావటంతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు కూడా ఉంటారు.

లభించే సేవలు ఇవే..

పల్మనాలజిస్ట్ (ఊపిరితిత్తులు), సైక్రియాటిస్ట్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, డెంటల్ సర్జన్, ఆప్తామాలజిస్ట్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్, ఫిజియోథెరపిస్టలు, ఫోరెన్సిక్, కార్డియాలజిస్ట్ తదితర విభాగాల్లో వైద్యులను, ప్రొఫెసర్లను నియమిస్తారు. దీంతో పాటు ఈసీజీ, ఎక్సరే, ఐసీయూ, వెంటిలేటర్ వంటి ఆధునిక సదుపాయాలున్న వైద్యశాలను ఏర్పాటు చేస్తారు. కేటాయించిన స్థలంలో సిబ్బంది క్వార్టర్స్, మెడికోలకు హాస్టల్ నిర్మాణం కూడా జరుగుతుంది. అలాగే అధునాతన వైద్య సేవలు అందుతాయి.

శరవేగంగా మెడికల్ కాలేజీ నిర్మాణం

మార్కాపురం మండలంలోని రాయవరం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి మెడికల్ కాలేజీని ప్రారంభించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించడంతో యుద్ధ ప్రాతిపదికపై భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇది పూర్తయితే పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని సుమారు 8 లక్షల మంది ప్రజలకు వైద్యసేవలు అందనున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు లభించనున్నాయి. మొత్తం 41.97 ఎకరాల విస్తీర్ణంలో కాలేజీ నిర్మాణం జరుగుతోంది.

నెరవేరనున్న కల

మెడికల్ కాలేజీ ఏర్పాటుపై ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి చేసిన కృషి ఫలించబోతుంది. వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ప్రత్యేక చొరవ చూపించారు. మెడికల్ కాలేజీకి 100 సీట్లు రానున్నాయి. నర్సింగ్ కాలేజీ, కిడ్నీ రిసెర్చ్ సెంటర్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు.



మెడికల్ కాలేజీ బ్లాక్‌లో మూడో అంతస్తు నిర్మాణ పనులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు



వెనుకబడిన మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. అధునాతన వైద్య సేవలు, స్పెషలిస్టు వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయి. సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. మార్కాపురం ప్రాంత ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారు. పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం



ముష్కార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



భీతావహంగా సంఘటనా స్థలం

- ఓ యువతికి తీవ్ర గాయాలు
- ఆదివారం పుట్టినరోజు.. ఇంతలోనే అనంత లోకాలకు..
- శోక సంద్రంలో కనిగిరి ఎన్జీఓ కాలనీ



మృతుడు ముష్కార్(ఫైల్)



చికిత్స పొందుతున్న లావణ్య

కనిగిరి రూరల్: బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందగా.. బైక్‌పై ఉన్న యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కనిగిరి మండలం గార్లపేట రోడ్డులోని వృద్ధుల ఆశ్రమం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కనిగిరి పట్టణంలోని ఎన్జీఓ కాలనీకి చెందిన మాజీ వార్డు మెంబర్, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు ఎస్కే చెరువుకట్ట షరీఫ్ కుమారుడు ఎస్కే ముష్కార్(26) వ్యక్తిగత పని మీద పునుగోడు వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అదే కాలనీకి చెందిన చందలూరి లావణ్య పునుగోడు వైపు వెళ్లేందుకు ముష్కార్‌ను లిఫ్ట్ అడిగింది. మార్గమధ్యంలో గార్లపేట రోడ్డులోని వృద్ధుల ఆశ్రమం సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముష్కార్, లావణ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు స్పందించి క్షతగాత్రులను కనిగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కొన ఊపిరితో ఉన్న ముష్కార్‌కు చికిత్స చేసేలోగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. లావణ్యను మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంలో తల్లిదండ్రులు

ఎంబీఏ పూర్తి చేసిన ఎస్కే ముష్కార్ ఉద్యోగం కోసం శనివారం హైదరాబాద్‌లోని తన బాబాయి దగ్గరకు వెళ్లాల్సి ఉంది. అయితే ఆదివారం పుట్టినరోజు కావడం.. కాలనీలో అందరూ కలిసి చేసుకునే వినాయక చవితి పండగ కూడా చూసుకుని వెళ్తానని తండ్రికి చెప్పి ఆగిపోయాడు. ఉదయం అప్పటి దాక కాలనీలోని యువకులతో సరదాగా గడిపిన ముష్కార్ నిమిషాల వ్యవధిలో మృత్యుఒడికి చేరడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు ఎస్కే షరీఫ్, మస్తాన్‌బీ శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎమ్మెల్యే బుర్రా సంతాపం

ముష్కార్ మృతికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సంతాపం తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జేసీఎస్ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

మాజీ సైనికులకు నూతన ఐడీ కార్డులు

మార్కాపురం: మాజీ సైనికులకు నూతన ఐడీ కార్డులను శుక్రవారం జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి రజనీ అందజేశారు. శుక్రవారం మార్కాపురంలోని మాజీ సైనికుల సంఘ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైనిక్ వెల్ఫేర్ అధికారి మాట్లాడుతూ.. మాజీ సైనికులు తమ భూసమస్యలపై రెవెన్యూ శాఖను సంప్రదించాలని సూచించారు. 'స్పర్శ' కార్యక్రమం గురించి వివరించారు. మార్కాపురం మాజీ సైనికుల సంఘ అధ్యక్షులు ఎస్.హరినారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, కార్యదర్శి వి. శేషసాయి, పలువురు మాజీ సైనికులు, మహిళలు పాల్గొన్నారు.



రజనీని సన్మానిస్తున్న మాజీ సైనికులు

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత

ఒంగోలు అర్బన్: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్ఓ) శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం స్పందన భవనంలో ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శుక్రవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సర్వీసు అంశాల్లో ఎదరవుతున్న సమస్యలు పరిష్కరించడంతోపాటు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఉద్యోగులు తెలియజేసిన సమస్యలను వేగంగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఏఓ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ముఖ్యం



ఇటుకలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ పేరయ్య

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇడుపూరు వద్ద నిర్మిస్తున్న జగనన్న లేఔట్‌ను హౌసింగ్ పీడీ ఈ.పేరయ్య శుక్రవారం సందర్శించారు. జగనన్న లేఔట్‌లో జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఇటుకల తయారీ, వాటర్ క్యూరింగ్‌పై ఆరా తీశారు. ఆయన వెంట హౌసింగ్ ఈఈ పవన్‌కుమార్, ఏఈ సాయిచంద్, సిబ్బంది ఉన్నారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు

మార్కాపురం: పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని తీసుకెళ్లి పెళ్లి చేసుకున్న యువకుడు యు.లక్ష్మీ నారాయణపై కిడ్నాప్, చైల్డ్ మ్యారేజీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎం.సువర్ణ శుక్రవారం తెలిపారు. వివరాలు.. మాచర్లకు చెందిన యు.లక్ష్మీనారాయణ మార్కాపురం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న విద్యార్థిని బంధువుల ఫిర్యాదు మేరకు ఈనెల 10వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనారాయణను గురువారం రాత్రి అరెస్టు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

బీహార్ యువకుడి దారుణ హత్య



హత్యకు గురైన రాజన్ పాశ్వాన్

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని రామభద్రాపురం గ్రామ సమీపంలో ఆవుల షెడ్లో బీహార్‌కు చెందిన యువకుడు రాజన్ పాశ్వాన్(21) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సారెడ్డి వెంకటరెడ్డి ఆవుల షెడ్లో రాజన్ పాశ్వాన్ గత కొంత కాలంగా కూలీపని చేస్తున్నాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రాజన్ పాశ్వాన్ వద్దకు వచ్చాడు. వెంకటరెడ్డి అతను ఎవరు అని రాజన్ పాశ్వాన్‌ను ప్రశ్నించగా తన స్నేహితుడు అని సమాధానం చెప్పాడు. ఇదిలా ఉంటే శుక్రవారం ఉదయాన్నే వెంకటరెడ్డి షెడ్ వద్దకు వచ్చి చూడగా రాజన్ పాశ్వాన్ బయట కనిపించలేదు. షెడ్ లోపలికి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడిఉన్నాడు. ముఖంపై గాయాలు కనిపించడంతో వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ రామకోటయ్య, ఎస్సై ప్రేమ్‌కుమార్ పరిశీలించి హత్య జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి రామ్‌జలాన్ పాశ్వాన్, అన్న లాలన్ పాశ్వాన్ శివరామపురంలో ఆవుల షెడ్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి అన్న లాలన్ పాశ్వాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకోటయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సై

పోస్టాఫీసుల్లో ఖాళీలను భర్తీ చేయాలని నిరసన

మార్కాపురం: పోస్టాఫీసుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ యూనియన్ల గుర్తింపును పునరుద్ధరించాలని ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ గ్రూప్–సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్లో భాగంగా మార్కాపురంలోని పోస్టల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ అకౌంట్ల డీసెంట్రలైజ్‌ను ఆపాలని, బ్రాంచి పోస్టాఫీసులకు 8 గంటల పని ఉండాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోస్టుమాస్టర్ ఎస్‌డీ సుబానీ, అసిస్టెంట్ సెక్రటరీ అర్షద్‌ఖాన్, ట్రెజరర్ ఎల్.సురేంద్రనాథ్, తపాలా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కంభం: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన టిప్పర్‌ను గమనించక బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా ఆయన భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘట శుక్రవారం రాత్రి కంభం మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. జంగంగుంట్ల గ్రామానికి చెందిన కొప్పుల శేఖర్‌రెడ్డి(40) శుక్రవారం రాత్రి తన భార్య శివకుమారితో కలిసి బైక్‌పై కంభం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో హైవే రోడ్డుపై పంక్చర్ అయి ఆగి ఉన్న టిప్పర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. శేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన భార్య శివకుమారిని స్థానికులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. కంభం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన శేఖర్‌రెడ్డి

ప్రజారోగ్యమే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల



సింగరాయకొండ: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపొందించారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ శివరామిరెడ్డి ఆస్పత్రిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష విధివిధానాలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. అక్టోబరు ఒకటి నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని 15,005 గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి 105 రకాల మందులు ఉచితంగా అందజేస్తారని వివరించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి, ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తి ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు.

కాపు మహిళలకు చేయూత

- నేడు కాపునేస్తం నాలుగో విడత నిధులు విడుదల
- జిల్లాలో 8707 మంది లబ్ధిదారుల గుర్తింపు
- లబ్ధిదారుల ఖాతాలకు నేడు జమకానున్న మొత్తం రూ.13.06 కోట్లు

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత నిధులు శనివారం విడుదల చేయనున్నారు. ఈ పథకాన్ని 2020 జూన్ 24న సీఎం ప్రారంభించారు. కాపు మహిళల సుస్థిర అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకుగాను ఈ నిధులు విడుదల చేస్తున్నారు. అందులో భాగంగా 45 నుంచి 60 ఏళ్ల వయస్సు మధ్యలో ఉన్న కాపు మహిళలను గుర్తించి వారికి ఆర్థిక చేయూత అందిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు చొప్పున మొత్తం 5 సంవత్సరాలపాటు అందిస్తున్నారు. ప్రస్తుతం విడుదల చేస్తున్నవి నాలుగో విడత నిధులు. తొలి విడత కింద జిల్లాలో 12322 మందికి రూ.18.48 కోట్లు, రెండో విడతలో 12613 మందికి రూ.18.91 కోట్లు, జిల్లా విభజన అనంతరం 8 నియోజకవర్గాల్లో సర్వేచేసి మూడో విడతలో 8317 మందికి రూ.12.48 కోట్లు వెరసి మూడు విడతల్లో రూ.49.87 కోట్లు అందించారు. తాజాగా గత మూడు దఫాల్లో వివిధ కారణాల రీత్యా లబ్ధిపొందలేకపోయిన వారిని కూడా సర్వేచేసి అర్హుల జాబితాను రూపొందించారు. ఈ దఫా 8707 మంది లబ్ధిదారులుగా ప్రకటించారు. వీరికి రూ.13,06,05,000 జమచేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిధులు విడుదల చేస్తుండగా ప్రకాశం జిల్లాకు సంబంధించి స్థానిక ప్రకాశం భవనంలోని సమావేశ మందిరం నుంచి ఉదయం 11 గంటలకు రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విడుదల చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	జమకానున్న మొత్తం రూ.కోట్లలో
దర్శి	1782	267.30
గిద్దలూరు	1384	207.60
కనిగిరి	835	125.25
కొండపి	569	85.35
ఒంగోలు	1541	231.15
మార్కాపురం	682	102.30
సంతనూతలపాడు	997	149.55
యర్రగొండపాలెం	917	137.55
మొత్తం	8707	1306.05

వైభవంగా 'నీ గానమే నా ప్రాణం'

యర్రగొండపాలెం: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం 'నీ గానమే నా ప్రాణం' అఖండ భజన అత్యంత వైభవంగా సాగింది. వేకువజామున 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన భజనలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులు, గురుస్వాములు, గాయకులు పాల్గొన్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు దేశ్‌పాండే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు డప్పు శ్రీను, ప్రధాన కార్యదర్శి వాసు, ప్రచార కార్యదర్శి హరినారాయణ, కోశాధికారి రంగాచారి, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, స్థానిక గురుస్వాములు యక్కలి భాగ్యారావు, చిలకల అంకిరెడ్డి, ఐవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



భక్తి గేయాలను ఆలపిస్తున్న గురుస్వాములు

ఒత్తిడిని వదిలేయండి ఇలా...



ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు పరుగులు మొదలు. చేయాల్సిన పనుల చిట్టా చాంతాడంత. దీంతో హడావుడి, ఆందోళన. ఫలితం ఒత్తిడి. అందుకనే ఈ రోజుల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు ఒత్తిడికి గురవుతున్నారు. ఆందోళనతో చిత్తవుతున్నారు. వీటి వల్ల వచ్చే శారీరక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరి ఈ ఒత్తిడిని తగ్గించుకుంటే చాలా అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు ఇంట్లో మనంతట మనం పాటించగల చిన్న చిట్కాలను చెబుతున్నారు. అవేంటో చూద్దామా..?

గోరు వెచ్చని లేదా చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది. శరీరంలో ఎక్కడైనా నొప్పులుగా అనిపిస్తే చిన్నగా మసాజ్ చేసుకోవడం, కండరాలన్నీ సాగేలా ఒళ్లు విరుచుకోవడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గుతుంది. బాత్ రూమ్‌లో కూనిరాగాలు తీయడం లేదా ఏదైనా లైట్ మ్యూజిక్‌ని పెట్టుకుని, గోరువెచ్చని నీటితో శరీరం, మనస్సు తేలిక పడేంతవరకు టబ్ బాత్ చేయాలి. అందుకు మంచి సువాసన ఉన్నసహజమైన సబ్బును ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

నృత్యం...

నృత్యం చేయడం అనేది ఒత్తిడి నివారిణిలా పని చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మంచి సంగీతాన్ని పెట్టుకుని దానికి తగినట్లుగా డ్యాన్స్ చేయవచ్చు. ఎవరైనా ఉన్నప్పుడు చేయడం మొహమాటం అయితే ఎవరూ లేనప్పుడు ఆ పని చేయండి. దీనివల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గుతుంది.

ఇష్టమైన వారితో ప్రేమగా...

ఎక్కువ ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇష్టమైన వారితో ప్రేమగా... సంతోషంగా గడిపేందుకు ప్రయత్నించండి. అందువల్ల శరీరంలో డోపమైన్ లాంటి హ్యాపీ హార్మోన్‌లు విడుదలవుతాయి. దీంతో మీరు ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.



ధ్యానం...

ఒత్తిడి నుంచి బయట పడటానికి ధ్యానం అద్భుతమైన మార్గం అని చాలా అధ్యయనాల్లో తేలింది. శ్వాస మీద ధ్యాస పెట్టి కేవలం రెండు నిమిషాలు కళ్లు మూసుకున్నా సరే అది మీ శరీరంలో స్ట్రెస్ హార్మోన్ సార్టిసాల్ స్థాయిల్ని తగ్గిస్తుంది.

బబుల్ ర్యాప్‌లను పగలగొట్టడం...

బబుల్ ర్యాప్ కవర్లను చూడగానే అంతా వాటిని పగలగొట్టాలని ఉవ్విళ్లూరతారు. అందుకు కారణాలు లేకపోలేదు. అలా వాటిని పేల్చడం వల్ల మనలో ఓ రకమైన ఆనందం కలుగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. అందువల్లనే మనం వాటిని పేల్చేందుకు ఇష్టపడుతుంటాం.

మంచి పుస్తకాలు చదవడం...

మంచి పుస్తకాలు, పేపర్లు చదవడం ద్వారా కూడా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. ఒత్తిడిగా అనిపించినప్పుడు మీకు నచ్చిన పుస్తకం తీసి చదవండి. వెంటనే తగ్గుముఖం పడుతుంది ఆ ఒత్తిడి. అలాగే రోజూ దినపత్రికలను చదవడం కూడా ఒత్తిడి నివారణలో ఒక భాగం. దినపత్రికలు చదవడమనగానే నేరవార్తలు, హత్యావార్తలు కాదు. మనసుకు కాస్తంత ఆహ్లాదం కలిగించే వార్తలు చదవడం మేలు.

ఆలయ సందర్శనం...

మీ మతాన్ని అనుసరించి మీరు ప్రార్థనామందిరాలను సందర్శించడం మంచిది. రోజూ కాసేపు పూజామందిరంలో గడపడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అలాగని దేనినీ అతిగా చేయరాదు. గంటలు గంటలు పూజలు చేస్తూ గడపడం కూడా మంచిది కాదు. క్రమం తప్పకుండా ఆలయానికి లేదా మసీద్‌కు లేదా చర్చికి వెళ్లడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది.

మీరు ఒత్తిడిలో ఉన్నారు అనుకున్నప్పుడువీటిలో మీకు వీలైనవాటిని పాటించి చూడండి.

అన్నింటికన్నా ముఖ్యం ఒత్తిడి వచ్చాక బాధ పడేకంటే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవడం చాలా ఉత్తమం. అదేవిధంగా ఒత్తిడి ఎందువల్ల వస్తుందో తెలుసుకుంటే నివారించుకోవడం సులభం కాబట్టి. ముందుగా మీ పనులను ప్రశాంతగా పూర్తి చేయడం ఆరంభించండి.

ఆహారానికి సుగంధం ఆరోగ్యానికి అందలం



ఆహారం సులభంగా జీర్ణమవడానికి ఆహారంలో కొన్ని సుగంధ ద్రవ్యాలను చేర్చుకుంటే మేలు. అవేంటో, ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం...

జీర్ణశక్తి బాగుంటే ఆరోగ్యం బాగున్నట్లే. మనం తీసుకునే ఆహారం మీదనే అది జీర్ణమవడం ఆధారపడి ఉంటుంది. మన వంటిళ్లలో సహజంగానే జీర్ణశక్తిని పెంచే సుగంధ ద్రవ్యాలు బోలెడుంటాయి. అలాంటి వాటిలో తేలికగా అందుబాటులో ఉండే పదార్థాలే ఎక్కువ. వాటిని వాడటం ద్వారా జీర్ణశక్తి ఎలా మెరుగవుతుందో చూద్దాం...



అల్లం...

దీర్ఘకాలిక అజీర్తి సమస్యలు ఉన్న వాళ్లకి అల్లం మంచి మందు. ఇది కడుపు నొప్పి రాకుండా చేస్తుంది. అల్లం టీ తాగడం, వండుకునే ఆహార పదార్థాల్లో కొంచెం అల్లాన్ని చేర్చడం ద్వారా ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. కడుపు ఖాళీ అవడానికీ ఇది సహకరిస్తుంది.



ధనియాలు...

కడుపు ఉబ్బరంగా, వికారంగా ఉన్నప్పుడు కాసిని ధనియాలు నీటిలో వేసి మరిగించి తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ధనియాల్లో ఉండే కొన్ని లక్షణాల వల్ల గ్యాస్ సమస్యలు దూరం అవుతాయి.



యాలకులు...

కడుపులో మంట, నొప్పి, వికారం లాంటి వాటికి యాలకులు మంచి మందులా పని చేస్తాయి. దీంట్లో మాంగనీసు ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న ఆహారం అరిగి శక్తినిచ్చేలా చేస్తుంది. మధుమేహం నుంచి కాపాడుతుంది.



మెంతులు...

నానబెట్టిన మెంతుల్ని ఖాళీ కడుపుతో తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అజీర్తి, మలబద్ధకం లాంటి వాటికి పరిష్కారం దొరుకుతుంది. పేగుల ఆరోగ్యం బాగుంటుంది.



సోంపు...

ఆహారం తేలిగ్గా జీర్ణం కావడానికి సోంపు చాలా మంచిది. ఇంట్లో కూడా తిన్న వెంటనే కొన్ని సోంపు గింజలు నమిలితే దీనిలో ఉండే పొటాషియం, జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్ లాంటి ఖనిజాలు జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిజేయడంలో సహకరిస్తాయి.



జీలకర్ర...

జీలకర్రలో మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పాస్పరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇంకా విటమిన్ ఎ, సి, కె, ఇ, బీ 6 కూడా ఉంటాయి. రోజూ టీ స్పూను జీలకర్ర తీసుకోవడం వల్ల ఈ పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పేగుల్లో పేరుకుపోయిన మలినాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. దీన్ని భోజనానికి ముందు తీసుకుంటే డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని ప్రేరేపిస్తుంది. జీర్ణక్రియలో సహకరిస్తుంది.

అందువల్ల ఈ సుగంధ ద్రవ్యాలను తప్పకుండా తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



- ఉసిరి పచ్చడి తీసుకోవడం, తేనెలో నానపెట్టిన ఉసిరిని నిత్యం పద్ధతి ప్రకారం సేవించడం ద్వారా దృష్టిలోపం తగ్గుతుంది. ఉసిరి పొడిని నిత్యం పరకడుపున తేనెతో కలిపి సేవించడం వల్ల వత్తిడి, అలసట తగ్గుతుంది.



- ఎండు ద్రాక్షలు లేదా కిస్‌మిస్‌లు వాడడం మంచిది. వీటికి చలువ చేసే గుణం వుంది. గ్లాసుడు నీళ్లలో ఎండు ద్రాక్షలు వేసి, నానపెట్టి, ఆ నీటిని తీసుకుంటే వేడి చేయకుండా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు చాలా మంచిది.



- గోధుమలు, బియ్యం, పెసలు, రాగులు, సోయాగింజ లు, జొన్నలు అరకిలో వంతున కలిపి, 50 గ్రాముల నువ్వులు, 20 గ్రాముల జీలకర్ర జోడించి, దోరగా విడివిడిగా వేయించాలి. ఆపై మరపట్టించి రొట్టెలు చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పిండితో జావ కూడా చేసుకోవచ్చు.



- నెలసరి నొప్పితో బాధపడేవారు పుదీనా ఆకులను నీళ్లలో వేసి మరిగించి, వడకట్టి, ఆ నీటిని సేవించడం వల్ల మంచి ఫలితం వుంటుంది. పుదీనా ఆకులు, ఉప్పు కలిపి నీటిలో మరిగించి, ఆ ఆవిరి పడితే గొంతు మృదువుగా మారుతుంది.

సడెన్‌గా చెమటలా..?

చెమటలు పట్టడం అనేది చాలా సాధారణ విషయం.. ఎందుకంటే శరీర శ్రమ అతిగా చేయడం వల్ల అందరిలో చెమట పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో మరింత సహజం. అయితే కొందరిలో చెమట విచ్చలవిడిగా పడుతూ ఉంటుంది. దీంతోపాటు కొందరిలో అకస్మాత్తుగా చెమటలు పోస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు చాలామంది దీనిని సాధారణ సమస్యగా భావించి తేలిగ్గా తీసుకుంటున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలని కొని తెచ్చుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా మీకు జరుగుతుంటే మాత్రం మీ ఒంటి మీద మీరు కాస్తంత శ్రద్ధ తీసుకోవాల్సిందే మరి!



అకస్మాత్తుగా చెమటలు పట్టడం అనేకరకాల అనారోగ్య సమస్యలకు ముందస్తు సూచనలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని గుండెజబ్బుల లక్షణాలలో ఒకటిగా వైద్యులు భావిస్తారు. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ముందు తరచు ఆకస్మాత్తుగా చెమటలు పడతాయని నిపుణులు చెబుతున్నారు. మీలో ఇలాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించడం, వారి సలహా మేరకు హెల్త్‌చెకప్ చేయించుకోవడం మంచిదని అనుభవజ్ఞుల సలహా.

అధిక చెమట ఈ వ్యాధుల లక్షణాలలో ఒకటి...

అకస్మాత్తుగా చెమటలు పట్టడం గుండెపోటు మొదటి లక్షణమని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. మహిళలకు రాత్రిపూట ఎక్కువగా చెమట పడడం వల్ల భవిష్యత్‌లో రానున్న తీవ్రసమస్యలకు సంకేతాలు. తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా కూడా ఎక్కువగా చెమట పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో మధుమేహం పెరగడం కారణంగా కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి.

- అకస్మాత్తుగా వచ్చే చెమటలు రాకుండా ఉండాలంటే... ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడం
- మద్యపానం అలవాటుంటే వెంటనే మానేయడం
- ఆకు కూరలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం
- గ్రీన్ టీ తీసుకోవడం
- రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం
- డీప్ ఫ్రైలు, ఇతర నూనె పదార్థాలను తగ్గించడం
- ప్రతి రోజూ తేలికపాటి వ్యాయామాలు చేయడం
- పద్ధతి ప్రకారం డైట్ తీసుకోవడం అవసరం.

సినిమా

మీ ఆనందమే నాకు సంతృప్తి



- విజయ్ దేవరకొండ

''నేను చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్ అంతా విహార యాత్రకు వెళ్తే నేను ఇంట్లో డబ్బులు అడిగి ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక అలాగే ఉండిపోయేవాడిని. ఆ విహార యాత్రలో నా స్నేహితులు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అని ఆలోచిస్తూ ఉండేవాడిని. తమ్ముడి (ఆనంద్ దేవరకొండ) ఇంజినీరింగ్ ఫీజు కోసం ఇబ్బంది పడుతున్నప్పుడు ఎవరైనా కొంత సహాయం చేస్తే బాగుండును అనిపించేది. కానీ ఎవర్నీ అడగడానికి ఇష్టం ఉండేది కాదు. అవన్నీ దాటుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. ఇవాళ మీకు (అభిమానులు) హెల్ప్ చేయగలుగుతున్నాను అంటే అది నా వ్యక్తిగత ఆకాంక్ష. నేను అందించే ఈ లక్ష రూపాయలతో మీకు ఒత్తిడి తగ్గి ఆనందం కలిగితే అది నాకు సంతృప్తిగా ఉంటుంది'' అన్నారు విజయ్ దేవరకొండ. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 1న విడుదలైంది. 'ఖుషి' సినిమా హ్యాపీనెస్‌ను షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు రూ. లక్ష చొప్పున చెక్స్ అందించారు విజయ్ దేవరకొండ. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఈ ప్రోగ్రామ్‌ను అనౌన్స్ చేసినప్పటి నుంచి మాకు ఇప్పటివరకూ 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ ఏడాది వంద మందికి మాత్రమే సహాయం చేయగలుగుతున్నాం. ప్రతి ఏడాది కొంతమందికి సహాయం చేస్తూనే ఉంటాను. నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకూ, సినిమాలు చేస్తున్నంతవరకూ నేను సహాయం చేస్తూనే ఉంటాను. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్'' అన్నారు. ''కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, సౌత్ స్టేట్స్ నుంచి సెలెక్ట్ చేశారు. సౌత్‌లో అన్ని ప్లేసెస్ నుంచి మా సినిమాకు మంచి స్పందన లభించింది'' అన్నారు శివ నిర్వాణ. ''వంద మందికి సహాయం చేయాలనే ప్రయత్నం మా మూవీతో విజయ్ మొదలుపెట్టినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు నవీన్, రవిశంకర్.

కోలీవుడ్ కబురు?

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వెళ్లిందట. తమిళ నటుడు అథర్వ హీరోగా ఆకాష్ అనే కొత్త దర్శకుడు ఓ తమిళ చిత్రాన్ని తెరకెక్కించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఖుషీ కపూర్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఖుషీకి ఈ కథ నచ్చిందని, ఆమె దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నది కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ఒకవేళ ఇదే నిజమైతే.. ఖుషీ కపూర్ నటించే తొలి తమిళ సినిమా ఇదే అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'పయ్యా ('ఆవారా')' సినిమాకు సీక్వెల్‌గా 'పయ్యా 2' రానుందని, ఇందులో ఆర్య హీరోగా నటిస్తారని, ఖుషీ కపూర్ హీరోయిన్‌గా ఎంపికయ్యారనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. అయితే 'పయ్యా 2' సీక్వెల్‌లో ఖుషీ కపూర్ నటిస్తుందనే వార్తల్లో వాస్తవం లేదని ఆమె తండ్రి, నిర్మాత బోనీ కపూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక హిందీలో 'ఆర్చీస్' అనే వెబ్ ఫిల్మ్‌లో ఖుషీ కపూర్ నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ నుంచి స్ట్రీమింగ్ కానుందని సమాచారం.



• ఖుషీ కపూర్

సప్త సాగరాలు

రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, రక్షిత్ శెట్టి కలిసి 'సప్త సాగరాలు దాటి' అనే పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేయనున్నారు. ''క్లాసిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. కన్నడలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



• రక్షిత్, రుక్మిణి



• మృణాల్ ఠాకూర్

ప్రేమకథ విన్నారా?

కెరీర్‌లో హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్నారు మృణాళ్ ఠాకూర్. నార్త్ అండ్ సౌత్ అనే తేడాలను పక్కన పెడితే ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన ఐదు సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయంటే ఆమె ఏ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారో ఊహించవచ్చు. ఇదే స్పీడ్‌ను కొనసాగించాలనుకుంటూ బాలీవుడ్ కొత్త సినిమాకు సై అన్నారట మృణాళ్. శ్రీదేవి టైటిల్ రోల్ చేసిన హిందీ హిట్ ఫిల్మ్ 'మామ్' తీసిన దర్శకుడు రవి ఉడయార్ ఇటీవల ఓ లవ్‌స్టోరీ స్క్రిప్ట్‌ను రెడీ చేసుకున్నారట. ఆయన ఈ కథను మృణాళ్‌కు వినిపించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని బీ టౌన్ టాక్.

ఆ రోజు కీడా కోలా



• బ్రహ్మానందం

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది?' చిత్రాల ఫేమ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ నటించి, తెరకెక్కించిన తాజా చిత్రం 'కీడా కోలా'. క్రైమ్ కామెడీ జానర్‌లో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీలో బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్ లీడ్ రోల్స్ చేశారు. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ సినిమాను నిర్మించారు. కాగా ఈ సినిమా నటుడు–నిర్మాత రానా సమర్పణలో నవంబరు 3న విడుదల కానున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

భయం.. అత్యాశ.. కుట్ర



• వంశీ, ఆనంద్ దేవరకొండ, ఉదయ్, అనురాగ్

ఆనంద్ దేవరకొండ హీరోగా ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'గం..గం.. గణేశా'. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ వేడుకలో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''భయం, అత్యాశ, కుట్ర అంశాల చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుంది. 'బేబీ' తో ఆడియన్స్ ఎంత ఎమోషనల్ అయ్యారో, 'గం..గం..గణేశా' చిత్రంతో అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఉదయ్ కథ, విజన్‌ను నమ్మి ఈ సినిమా చేశాను'' అన్నారు. ''ఈ సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు వంశీ కారుమంచి. 'ప్రేక్షకులకు నచ్చే చిత్రం ఇది'' అన్నారు ఈ చిత్ర సహనిర్మాత అనురాగ్ పర్వతనేని.

మిస్టర్ ఇడియట్ వస్తున్నాడు

హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. గౌరీ రోణంకి దర్శకత్వంలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం మాధవ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మిస్టర్ ఇడియట్' లోని మాధవ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శక–నిర్మాత కె. రాఘవేంద్ర రావు విడుదల చేశారు. ''మిస్టర్ ఇడియట్' ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గౌరీ రోణంకి. ''నవంబరులో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాత జేజేఆర్ రవిచంద్.



• మాధవ్, సిమ్రాన్ శర్మ

అందాలు చదివే కళ్లకైనా...



• పంఖురి, నవదీప్

నవదీప్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, మిర్చి హేమంత్ నటించారు. ప్రశాంత్ రెడ్డి తాటికొండ నిర్మాత. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అందాలు చదివే కళ్లకైనా.. కందాలు తిరిగే కాళ్లకైనా.. వందేళ్లు కదిలే గుండెకైనా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను అనిల్ కృష్ణన్ పాడారు. ''లవ్ మౌళి' షూటింగ్ మొత్తం మేఘాలయలోని చిరపుంజీలో చిత్రీకరించాం'' అని యూనిట్ పేర్కొంది.